సాక్షి నిజామాబాద్

మంగళవారం । 14 । మార్చి । 2023



పెండింగ్‌లో ఉంచొద్దు

ప్రజావాణి దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచొద్దని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ఆదేశించారు.

- 9లో ▸



మహిళలు ఆర్థికంగా ఎదగాలి

స్వయం ఉపాధి ద్వారా మహిళలు ఆర్థికంగా ఎదగాలని, కుటుంబానికి తోడుగా నిలవాలని సీనియర్ సివిల్ జడ్జి పద్మావతి అన్నారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 35.7 /21.0

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. క్రమంగా ఎండ తీవ్రత పెరుగుతుంది. సాయంత్రం ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

రేపటి నుంచి ఒంటిపూట బడులు

నిజామాబాద్‌అర్బన్: జిల్లాలో బుధవారం నుంచి పాఠశాలలకు ఒంటిపూట తరగతులు నిర్వహిస్తున్నట్లు డీఈవో దుర్గాప్రసాద్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ఈ ఆదేశాలు పాటించాలన్నారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పాఠశాలలు కొనసాగుతాయని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్నం 12.30 గంటలకు మధ్యాహ్న భోజనం అందించాలన్నారు. పదో తరగతి పరీక్షలు నిర్వహిస్తున్న కేంద్రంలో మాత్రం మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతుల బోధన కొనసాగుతుందన్నారు.

అడవుల్లో అధికారుల తనిఖీలు



సిరికొండ: సిరికొండ అటవీ రేంజ్ పరిధిలోని తూంపల్లి, పందిమడుగు, సిరికొండ సెక్షన్ల అడవుల్లో జిల్లాలోని వివిధ రేంజ్‌లకు చెందిన అటవీశాఖ అధికారులు సోమవారం తనిఖీలు చేపట్టారు. మండల పరిధిలోని అటవీ ప్రాంతంలో కొత్తగా పోడు భూముల కోసం చెట్లను నరికేసి భూమిని చదును చేస్తున్నారని, అక్రమంగా కలప తరలింపు జరుగుతుందని డీఎఫ్‌వోకు ఫిర్యాదు చేశారు. డీఎఫ్‌వో వికాస్‌మీనా ఆదేశాల మేరకు నిజామాబాద్ నార్త్ ఎఫ్‌ఆర్‌వో పద్మారావు, ఇందల్‌వాయి ఎఫ్‌ఆర్‌వో హిమచందన, కమ్మర్‌పల్లి ఎఫ్‌ఆర్‌వో రవీందర్‌ల ఆధ్వర్యంలో మూడు సెక్షన్ల పరిధిలో తనిఖీలు చేశారు. అటవీ ప్రాంతంలో నరికేసిన టేకు చెట్ల కొలతలు సేకరించారు. తూంపల్లి, పందిమడుగు, సిరికొండ అడవుల్లో నరికేసి అక్రమంగా తరలించడానికి సిద్ధం చేసిన టేకు దుంగలను గుర్తించినట్లు ఆయా అధికారులు తెలిపారు. వాటిని రేంజ్ కార్యాలయానికి తరలించాలని సిబ్బందిని ఆదేశించినట్లు తెలిపారు. తనిఖీల నివేదికను డీఎఫ్‌వోకు అందజేస్తామని వారు తెలిపారు.

డ్రిప్ పరికరాల కోసం అధికారులను సంప్రదించాలి

ఇందూరు(నిజామాబాద్ అర్బన్): జిల్లాలో ఆయిల్‌పామ్ తోటలు సాగు చేపడుతున్న రైతులు డ్రిప్ ఇరిగేషన్ పరికరాల కోసం క్షేత్రస్థాయి అధికారులను సంప్రదించాలని జిల్లా ఉద్యానశాఖ డిప్యూటీ డైరెక్టర్ నర్సింగ్‌దాస్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం ఎండలు అధికంగా ఉన్నందున ఆయిల్‌పామ్ సాగుకు నీటి ఇబ్బందులు తలెత్తకుండా డ్రిప్‌ను వినియోగించాలన్నారు. అయితే డ్రిప్ కోసం దరఖాస్తు చేసుకుని పరిరాలు అందని రైతులు 79977 25309 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

వైద్య విద్యార్థులకు పరీక్షలు



నిజామాబాద్ సిటీ : వైద్య విద్యార్థుల సర్జరీ పరీక్షలు సోమవారం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో జరిగాయి. వైద్య విద్యార్థులు ఆస్పత్రిలో రోగుల ఆరోగ్య స్థితిగతులపై విచారించి పరీక్షలు రాశారు. పరీక్షలను మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఇందిరా, ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రతిమారాజ్ పర్యవేక్షించారు.

రైతులు హక్కులు సాధించుకోవాలి

- నిజాం షుగర్ ఫ్యాక్టరీని మూసివేసిన ఘనత కేసీఆర్‌దే
- సీఎంకు మంత్రి ప్రశాంత్‌రెడ్డి కట్టుబానిసలా మారారు
- టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి



ఏర్గట్ల కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి



హాథ్ సే హాథ్ జోడో యాత్రలో పాల్గొన్న టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే సీతక్క, మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అనిల్ తదితరులు

మోర్తాడ్(బాల్కొండ): వ్యవసాయం పండుగలా మారాలంటే ఇక్కడి రైతులు హర్యానా, పంజాబ్ రైతుల స్ఫూర్తితో హక్కులు సాధించుకోవాలని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఉమ్మడి రాష్ట్రంలో చెరుకు పరిశ్రమలను నడిపిస్తే తెలంగాణ వచ్చిన తర్వాత వాటిని మూసివేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. చక్కెర ఫ్యాక్టరీని తెరిపించుకోవడానికి రైతులు పోరాటం చేయాల్సి ఉందన్నారు. హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా సోమవారం ఏర్గట్లలో కార్నర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ మేం రైతులతో సమావేశాన్ని నిర్వహిస్తే రైతులు రాకుండా ఒక సన్నాసి బెరించారని తెలిసిందన్నారు. అయినా రైతులు బెదరకుండా సమావేశానికి రావడం విశేషమన్నారు. కవితను ఓడించి కల్వకుంట్ల కుటుంబాన్ని పాతర వేసిన చరిత్ర ఈ ప్రాంతానికి ఉందని పేర్కొన్నారు. పసుపు బోర్డు తెస్తానని ఎంపీ అర్వింద్ ఇక్కడి రైతులను మోసం చేశారని విమర్శించారు. బాండ్‌పేపర్ రాసిచ్చి మాట తప్పిన ఆయనను పొలిమేరలకు తరమాలన్నారు. కేసీఆర్‌కు కట్టు బానిసగా బతుకుతున్న మంత్రి ప్రశాంత్‌రెడ్డి ఫాంహౌజ్‌లో పనిచే స్తూ ఏ ఒక్కరోజు కూడా మంత్రిగా వ్యవహరించలేదని ఎద్దేవా చేశారు. గృహ నిర్మాణ మంత్రిగా ఉన్న ప్రశాంత్‌రెడ్డి తనను గెలిపించిన ప్రజలకు ఒక్క డబుల్ బెడ్‌రూం ఇల్లు ఇవ్వలేకపోయారన్నా రు. సిద్దిపేట్, గజ్వేల్, సిరిసిల్లల్లో మాత్రం డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇచ్చారని గుర్తు చేశారు. 2024 నుంచి 2034 వరకు అధికారంలో ఉండేది కాంగ్రెస్ పార్టీ అని ఉద్ఘాటించారు. కాంగ్రెస్ కార్యకర్తలపై అక్రమ కేసులు పెడితే డైరీలో రాసుకోండని.. అధికారంలోకి వచ్చిన తర్వాత మిత్తీతో సహా చెల్లిస్తామన్నారు. గంజాయి విక్రయాలను ప్రోత్సహిస్తూ మంత్రి, అతని సోదరుడు యువతను బానిసలుగా మార్చడం అవివేకమని విమర్శించారు. రోడ్లు అధ్వానంగా ఉన్నాయని దీనికి మంత్రి బాధ్యత వహించాలన్నారు.

తల్లుల కన్నీటి ప్రవాహంలో కొట్టుకుపోతారు : మాజీ విప్ అనిల్

బాల్కొండ నియోజకవర్గంలో గంజాయి దందా చేయిస్తూ మంత్రి, అతని సోదరుడు అజయ్‌రెడ్డి కన్నతల్లుల కన్నీటి ప్రవాహంలో కొట్టుకుపోతారని మాజీ ప్రభుత్వ విప్ అనిల్ హెచ్చరించారు. రాజకీయ విలువలు పాటించాలని సూచించారు. సాగునీటి కోసం ఉద్యమాలు చేయాల్సిన పరిస్థితిని మంత్రి కల్పించారన్నారు.

తెలంగాణలో స్వేచ్ఛలేదు : ఎమ్మెల్యే సీతక్క

తెలంగాణ ప్రభుత్వం నియంత పాలన సాగిస్తుందని జనాలకు స్వేచ్ఛ అసలే లేదని ములుగు ఎమ్మెల్యే సీతక్క పేర్కొన్నారు. ఉద్యమాలు చేస్తే జైల్‌లో పెడుతున్నారని ఆరోపించారు. ప్రజలకు స్వేచ్ఛ కావాలంటే ఇందిరమ్మ రాజ్యం రావాలని కోరారు. అందరూ కలిసి కట్టుగా కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు.

ప్రజాక్షేత్రంలోనే తేల్చుకుంటాం: మానాల మోహన్‌రెడ్డి

జిల్లాలో రాజకీయ కక్షలను ప్రోత్సహిస్తూ తమకు వ్యతిరేకంగా ఉన్నవారిపై అక్రమ కేసులను పెట్టిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులతో ప్రజాక్షేత్రంలోనే తేల్చుకుంటామని డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి అన్నారు. రేవంత్‌రెడ్డి సభకు, పాదయాత్రకు మంత్రి ప్రశాంత్‌రెడ్డి ఎన్నో అడ్డంకులు సృష్టించాలని ప్రయత్నించినా ప్రజల ఆశీర్వాదంతో విజయవంతం అయ్యిందన్నారు. విద్యార్థిపై గంజాయి కేసు పెట్టించడంతోనే మంత్రి విలువ దిగజారిపోయిందన్నారు. పోలీసులు సమయమనం పాటించాలని అధికార పార్టీ ఏది చెబితే అది చేయకూడదని సూచించారు.

మంత్రి ప్రశాంత్‌రెడ్డిపై కాంగ్రెస్ చార్జ్‌షీట్



మంత్రి వేములపై చార్జ్‌షీట్‌ను ప్రకటిస్తున్న మాజీ ఎమ్మెల్యే అనిల్

కమ్మర్‌పల్లి: రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డిపై కాంగ్రెస్ చార్జ్‌షీట్ ప్రకటించింది. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేపట్టిన హాథ్ సే హాథ్ జోడోయాత్రలో భాగంగా పాదయాత్ర చేస్తున్న నియోజకవర్గంలో అక్కడి అధికార పార్టీ ఎమ్మెల్యేపై కాంగ్రెస్ చార్జ్‌షీట్ వేసింది. ఇందులో పొందుపరిచిన తొమ్మిది అంశాలను కమ్మర్‌పల్లిలోని రేవంత్‌రెడ్డి బస వేదిక వద్ద మాజీ ఎమ్మెల్యే ఈరవత్రి అనిల్ మీడియాకు వెల్లడించారు.ఏర్గట్ల మండలం బట్టాపూర్‌లో మంత్రి ప్రశాంత్‌రెడ్డి, అనుచరుడు భోజారెడ్డి అక్రమంగా క్వారీ నడుపుతూ రూ. కోట్లు దండుకుంటున్నారని ఆరోపించారు. పరిమితులు లేకుండా మైనింగ్ చేయడంతో చుట్టుపక్కల 500 ఎకరాల వ్యవసాయ భూములు దెబ్బతినడంతో పాటు, ప్రభుత్వ ఖజానాకు నష్టం తీసుకువస్తున్నారని ధ్వజమెత్తారు. మంత్రి సోదరుడు నియోజకవర్గంలో అనధికారికంగా పెత్తనం చెలాయిస్తున్నాడన్నారు. రాజకీయాల కోసం చదువుకునే పిల్లలతో సోషల్ మీడియాలో ఇతరులపై కామెంట్లు పోస్టు చేయిస్తున్నాడన్నారు. డీసీవో సింహాచలం సహకారంతో తన బినామీలను ఉపయోగించి ధాన్యం సేకరణలో రూ. కోట్లు స్వాహా చేశారని ఆరోపించారు. ఎమ్మెల్యే, అతని అనుచరులు కాకతీయుల కాలం నాటి రథం చెరువును కబ్జా చేశారని, 77.22 ఎకరాల ఉన్న చెరువు భూమిని కబ్జాచేసి రియల్ ఎస్టేట్‌లో కోట్లు గడించారని వెల్లడించారు. భీమ్‌గల్ వేముగంటి ప్రాజెక్టును కమీషన్ల కోసం పక్కదోవ పట్టించారన్నారు. తన స్వప్రయోజనాల కోసం అధికారాన్ని వినియోగించుకుంటున్నారన్నారు. ఎమ్మెల్యే సోదరుడు బాల్కొండ నియోజకవర్గాన్ని గంజాయి కేంద్రంగా మార్చి యువతను మత్తుకు బానిసలుగా మార్చి రౌడీలుగా తయారు చేస్తున్నాడని దుయ్యబట్టారు. మండలానికో ఐటీఐ కళాశాల, డిగ్రీ కళాశాల, మినీ స్టేడియం హామీలను మరిచారన్నారు. డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, మండలాధ్యక్షుడు సుంకెట రవి, నాయకులు క్యాతం గంగారెడ్డి, బుచ్చారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన సమస్యలపై ఫోకస్

- రేవంత్‌రెడ్డి యాత్రలో ధరణి, మంచిప్ప, తెయూ, విమానాశ్రయంపై దృష్టి
- మంచిప్ప ఏరియాను సందర్శించనున్న పీసీసీ చీఫ్

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: వచ్చే ఎన్నికల నేపథ్యంలో ఇప్పటికే రాజకీ యంగా వాతావరణం హీటెక్కింది. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేపట్టిన హాథ్ సే హాథ్ జోడో యాత్ర జిల్లాలో కొనసాగుతోంది. నేడు, రేపు నిజామా బాద్ రూరల్ నియోజకవర్గంలో రేవంత్ పాదయాత్ర నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో కీలకమైన కాళేశ్వరం 21వ ప్యాకేజీ కింద చేపట్టిన మంచిప్ప రిజర్వాయర్‌ను రేవంత్‌రెడ్డి సందర్శించనున్నా రు. కాగా గతంలో దివంగత సీఎం వైఎస్సార్ హయాంలో దీన్ని 1.5 టీఎంసీల నీటి సామర్థ్యంతో నిర్మించేలా అంచనా లు రూపొందించారు. అయితే కేసీఆర్ ప్రభుత్వం వచ్చాక దీన్ని రీడిజైన్ చేసి 3.5 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో నిర్మిస్తున్నారు. అదనంగా ఆయకట్టు పెరగకున్నా కమీషన్ల కోసమే సామర్థ్యం పెంచి గిరిజన రైతుల భూములు ముంపుకు గురయ్యేలా చేస్తున్నారని కాంగ్రెస్ నాయకులు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో రేవంత్ మంచిప్ప సందర్శన ప్రాధాన్యం సంతరించుకుంటోంది. ఇక ధరణి పోర్టల్ బీఆర్‌ఎస్ నేతలకు ఏటీఎంలా మారిందని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. తాము అధికారంలోకి వస్తే ధరణిని రద్దు చేస్తామని కాంగ్రెస్ ప్రకటించింది. జిల్లాలో పోడు భూముల పట్టాల అంశం ఈ నియోజకవర్గంలోనే ఉంది. ఇక ధర్పల్లి, డిచ్‌పల్లిలలో 100 పడకల ఆస్పత్రులకు డిమాండ్ ఉంది. ఇదిలా ఉండగా తెలంగాణ వర్సిటీకి 2014 నుంచి ఏటా రూ. 100 కోట్లు ఇస్తామని చెప్పిన కేసీఆర్ ఒక్క పైసా ఇవ్వలేదని విద్యాభిమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక నిజాంషుగర్స్, సారంగాపూర్ చక్కెర ఫ్యాక్టరీల మూసివేత వ్యవహారంపై కాంగ్రెస్ నాయకులు ప్రశ్నిస్తున్నారు. జక్రాన్‌పల్లి విమానాశ్రయం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు భూములు ఇవ్వకపోవడాన్ని ప్రస్తావిస్తున్నారు. కాగా రామడుగు, గుండారం మండలాల ఏర్పాటు విషయమై హామీ ఏమైందంటున్నారు. ధర్పల్లి మార్కెట్ కమిటీ, పసుపు శుద్ధి, పసుపు రీసెర్చ్ కేంద్రాల హామీ ఏమైందని కాంగ్రెస్ నాయకులు ప్రశ్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో రేవంత్‌రెడ్డి ద్వారా వీటితో పాటు ఇతర అంశాలపై చార్జ్‌షీట్ విడుదల చేసేందుకు కాంగ్రెస్ సిద్ధమైంది.

ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

- వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ వెల్లడి
- జిల్లాలో కంట్రోల్ రూమ్ నంబర్ 08462-295452



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్

నిజామాబాద్‌నాగారం: ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకున్నామని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. ఇంటర్ పరీక్షల నిర్వహణ ఏర్పాట్ల విషయమై సోమవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఇంటర్ బోర్డు అధికారులతో కలిసి ఆయా జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటర్ పరీక్షల నిర్వహణ కోసం జిల్లాలో చేపట్టిన చర్యలపై కలెక్టర్ మంత్రి దృష్టికి తెచ్చారు. ఈ నెల 15 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు జరుగనున్న పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 35,017 మంది విద్యార్థులు హాజరుకానున్నారని తెలిపారు. వీరిలో 17,503 మంది మొదటి సంవత్సరం పరీక్షలు రాయనుండగా, 17,514 మంది ద్వితీయ సంవత్సరం పరీక్షలు రాయనున్నారని వివరించారు. వీరికోసం జిల్లా వ్యాప్తంగా మొత్తం 54 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఇప్పటికే సంబంధిత శాఖల అధికారులకు కో–ఆర్డినేషన్ మీటింగ్ నిర్వహించి అవసరమైన ఆదేశాలు చేశామన్నారు. పరీక్షా కేంద్రాల్లో అన్ని వసతులు అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేశామని తెలిపారు. మాల్ ప్రాక్టీస్‌కు అవకాశం లేకుండా ఇన్విజిలేటర్లతో పాటు ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్ బృందాలను నియమిస్తున్నామని వివరించారు. విద్యార్థులకు ఎలాంటి సమస్య ఉన్నా, వాటిని పరిష్కరిస్తూ వారి సందేహాలను నివృత్తి చేసేందుకు వీలుగా జిల్లా స్థాయిలో కంట్రోల్ రూమ్ నంబర్: 08462 – 295452 ఏర్పాటు చేశామన్నారు.

బదిలీలకు మోక్షం లభించేనా..?

- కోర్టు తీర్పుపైనే టీచర్ల ఆశలు
- నేడు కోర్టుకు బదిలీలు, పదోన్నతుల నివేదిక
- స్పౌజ్, నాన్ స్పౌజ్ వివాదం పరిష్కారమయ్యేనా!

నిజామాబాద్‌అర్బన్: ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ ఈ ఏడాది జనవరిలో ప్రారంభమైన విషయం విదితమే. ప్రభుత్వం ఇందుకు సంబంధించి షెడ్యూల్ కూడా విడుదల చేసింది. కానీ స్పౌజ్, నాన్‌స్పౌజ్ టీచర్లు కొందరు హైకోర్టును ఆశ్రయించడంతో ప్రక్రియకు బ్రేక్ పడింది. బదిలీల్లో భాగంగా స్పౌజ్ టీచర్లకు కేటాయించిన పాయింట్లపై వివాదంపై కొందరు కోర్టును ఆశ్రయించారు. దీంతో హైకోర్టు గత నెల 28న బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను మార్చి 14 తర్వాత చేపట్టాలని అందుకు సంబంధించిన వివరాలను కోర్టుకు సమర్పించాలని ఆదేశాలు జారీచేసింది. ప్రస్తుతం హైకోర్టు ఆదేశించిన గడువు నేటితో ముగియనుంది. దీంతో ప్రభుత్వం బదిలీలు సంబంధించిన ప్రక్రియ ఎలా చేపడుతున్నారని నివేదికను హైకోర్టుకు సమర్పించనుంది. దీనిని పరిశీలించిన తర్వాత కోర్టు ఈ ప్రక్రియకు ఏ విధమైన తీర్పు ఇస్తుందోనని ఉపాధ్యాయులు ఎదురుచూస్తున్నారు.

జిల్లాలో 4,752 మంది టీచర్లు

జిల్లాలో 1,191 పాఠశాలలు ఉండగా, 4,752 మంది టీచర్లు ఉన్నారు. ఇందులో 2015 మంది స్కూల్ అసిస్టెంట్లు, 489 మంది లాంగ్వేజ్ పండిట్లు, 2,144 మంది ఎస్జీటీలు ఉన్నారు. వీరికి ఏడేళ్లుగా బదిలీలు, ప్రమోషన్లు ఇవ్వలేదు. గత జనవరిలో బదిలీల ప్రక్రియ ప్రారంభించగా జిల్లాలో 103 పీజీ హెచ్‌ఎంలు, 277 మంది స్కూల్ అసిస్టెంట్లు పదోన్నతులకు అర్హులుగా గుర్తించారు. అలాగే 8 ఏళ్ల పూర్తి చేసుకున్న వారు 1,502 మంది ఉన్నారు. ఖాళీల ప్రకారం పదోన్నతులకు 297 మంది అర్హులుగా గుర్తించారు. బదిలీలకు సంబంధించి 3,722 మంది టీచర్లు దరఖాస్తు చేసుకున్నారు. వీరికి షెడ్యూల్ ప్రకారం బదిలీలు చేపట్టాల్సి ఉంది.

పదోన్నతులు ఇప్పిస్తాం..



టీచర్లు బదిలీలు, పదోన్నతులు ఇప్పించే బాధ్యత పీఆర్‌టీయూదే. ప్రభుత్వం ఇందుకు కూడా సిద్ధంగా ఉంది. త్వరలోనే ఈ ప్రక్రియ ప్రారంభం అవుతుంది.

–మోహన్‌రెడ్డి, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు

న్యాయం జరిగేలా చూడాలి



పదోన్నతులు, బదిలీల ప్రక్రియ ఇప్పటికే చాలా ఆలస్యమైంది. ప్రభుత్వం వివాదాలను పరిష్కరించి ప్రక్రియను కొనసాగించాలి. అందరికీ న్యాయం జరిగేలా చూడాలి.

–పెంటా జలంధర్, టీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు

రక్తమోడుతున్న రహదారులు

- జిల్లాలో తరచూ రోడ్డు ప్రమాదాలు
- ప్రాణాలు కోల్పోతున్న ఎంతో మంది
- నిర్లక్ష్యం, అతివేగం, మద్యం మత్తులో డ్రైవింగ్‌లే కారణాలు



ఇందల్వాయి మండలం చంద్రాయన్ పల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదం.. కారులో మృతదేహాలు

- మార్చి 12న రాత్రి ఇందల్వాయి మండలం చంద్రాయన్‌పల్లిలో భారీ ట్రక్‌ను ఢీకొనడంతో కారులో ప్రయాణిస్తున్న నలుగురు అక్కడిక్కడే మృతి చెందారు. ఇందులో జిల్లా కేంద్రానికి చెందిన సాయి, మహారాష్ట్రలోని కొండల్‌వాడికి చెందిన అన్నదమ్ములు ఆదిత్య, గణేశ్‌లు, మరో వ్యక్తి ప్రకాశ్ ఉన్నారు.
- జనవరి 14న డిచ్‌పల్లి మండలంలోని సుద్దులం దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వారిని వెనుక నుంచి డీసీఎం ఢీకొనడంతో ఒకరు అక్కడిక్కడే మృతి చెందగా మరొకరు చికిత్సపొందుతూ మృతి చెందారు.
- డిసెంబర్ 10న కొండగట్టులో మొక్కులు తీర్చుకోవడానికి వెళ్తున్న ముగ్గురు యువకులు ఆర్మూర్ మండలంలోని చేపూర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. చేపూర్ వద్ద మూలమలుపు వద్ద కారును ఓవర్ టేక్ చేయడంతో ఈ ఘటన చోటు చేసుకుంది.

ఖలీల్‌వాడి: జిల్లాలో రహదారులు రక్తసిక్తమవుతున్నాయి.. తరచూ ప్రమాదాలు సంభవిస్తుండడంతో ప్రజల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. ప్రమాదాల్లో ఇంటిపెద్దలతో పాటు యువత అర్ధాంతరంగా మృత్యు ఒడికి చేరుకుంటుండడంతో ఎన్నో కుటుంబాలు చిన్నాభిన్నం అయిపోతున్నాయి. ఇంట్లో నుంచి బయలుదేరిన వాళ్లు.. తిరిగి క్షేమంగా ఇంటికి చేరుతారనే నమ్మకం లేని పరిస్థితులు నెలకొన్నాయి. అతివేగం, మద్యం తాగడం, రోడ్డు భద్రతా నిబంధనలను పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వాహనాలు నడుపుతుండడంతో ప్రమాదాల సంఖ్య రోజు రోజుకు పెరుగుతోంది.

దేశంలో ప్రతి నాలుగు నిమిషాలకు ఒక రోడ్డు ప్రమాదం చోటు చేసుకున్నట్లు కేంద్ర ప్రభుత్వం ఇటీవ ల ప్రకటించిన గుణాంకాలు చెబుతున్నాయి.. ప్రతి ది నం 360 మంది రోడ్డు ప్రమాదాలతో ప్రాణాలు పో గొట్టుకుంటున్నారు. 25 శాతం రోడ్డు ప్రమాదాలు ద్వి చక్ర వాహనదారులకే జరుగుతున్నాయి. ఈ ప్రమాదా ల్లో 16 మంది చిన్న పిల్లలు చనిపోతున్నారని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది.

రోడ్డు ప్రమాదాల గణాంకాలు

సంవత్సరం	కేసులు	మరణాలు
2020	306	331
2021	320	329
2022	291	320

ర్యాష్ డ్రైవింగ్..

జాతీయ రహదారులపై 120 నుంచి 150 కిలోమీటర్ల వేగంతో వాహనాలను నడిపిస్తున్నారు. ర్యాష్ డ్రైవింగ్‌తో వాహనాలు అదుపు తప్పి మృతి చెందిన ఘటనలు ఉన్నాయి. అలాగే ఓవర్ స్పీడ్‌తో ఇతర వాహనాలను ఢీకొనడంతో రెండు వాహనాదారులు ప్రమాదాలకు గురవుతున్నాయి. వాహనాలను రహదారుల భద్రత సూత్రాలను 60 కిలోమీటర్లు వేగంతో వెళ్తే వాహనాలు అదుపులో ఉండే అవకాశం ఉంటుంది. వాహనాల మధ్య 50 అడుగుల దూరం ఉండేలా చూసుకోవాలి. దూర ప్రాంతాలకు వెళ్లే సమయంలో వాహనాలు నడిపేవారు నిద్ర, విశ్రాంతి తీసుకోవాలి.

మద్యం మత్తులో నడపడంతో..

మద్యం మత్తులో చాలా మంది వాహనాలు నడపడంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. మత్తులో వాహనాలను వేగంగా నడపడం వల్ల నియంత్రణ చేయడం కష్టమవుతుంది. ఓవర్ టేక్ చేసేటప్పుడు భారీ వాహనాలు వెళ్తున్న సమయంలో ఓవర్ టేక్ చేయడంతోనే ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

ఓవర్ టేక్‌ల వల్ల ఎక్కువ ప్రమాదాలు



వాహనాలను ఓవర్ టేక్ చేసే సమయంలో ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయి. మద్యం మత్తులో వాహనాలను నడపరాదు. 60 కిలోమీటర్లు మించి వేగంగా వెళ్లకూడదు. రాత్రివేళ్లలో ప్రయాణాలను వాయిదా వేసుకుంటే మంచిది. నిద్రలేకుండా వాహనాలు నడిపితే ప్రమాదాలు చోటు చేసుకుంటాయి. యువకులు ర్యాష్ డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలి. ప్రమాదాలతో కుటుంబాలు రోడ్డున పడతాయి.

– కిరణ్‌కుమార్, ఏసీపీ, నిజామాబాద్

కారు బోల్తా

నందిపేట్‌: మండలంలోని సీహెచ్‌ కొండూరు శివారులో సోమవారం సాయంత్రం కారు అదుపు తప్పి బోల్తా పడింది. వివరాలు ఇలా ఉన్నాయి.. మాక్లూర్‌ సర్పంచ్‌ బోయినపల్లి అశోక్‌ కుమార్‌ తన కారులో సిహెచ్‌ కొండూరు శివారులోని చౌడేశ్వరి ఆలయంలో పూజలు చేసేందుకు వెళ్లారు. పూజలు చేసి తిరిగి వస్తుండగా గ్రామ సమీపంలో ఎదురుగా వస్తున్న బైకుని తప్పించబోయి అదుపు తప్పి కారు రోడ్డు కిందకు బోల్తా పడింది. చుట్టుపక్కల వారు చూసి తీవ్ర గాయాల పాలైన అశోక్‌కుమార్‌ను అంబులెన్స్‌లో జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు.


బోల్తా పడిన కారు

బాలసదనం నుంచి ఇద్దరు బాలికల పరారీ

ఖలీల్‌వాడి: నిజామాబాద్‌ బాలసదనం నుంచి ఇద్దరు బాలికలు పరారీ అయినట్లు ఎస్సై శ్రావణ్‌ కుమార్‌ తెలిపారు. వివరాలు.. అధికారులు ఇద్దరు బాలికలను షెల్టర్‌ కోసం బాలసదన్‌కు తరలించారు. అక్కడ ఆశ్రయం పొందుతున్న వారు సోమవారం ఉదయం 6 గంటల నుంచి కనిపించలేదు. వారు పారిపోయారని బాలసదనం సూపరింటెండెంట్‌ సునంద ఫిర్యాదు చేశారని ఎస్సై తెలిపారు.

ఇసుక లారీ పట్టివేత

బాన్సువాడటౌన్‌: బాన్సువాడలో ఆదివారం ఇసుక లారీ పట్టుకున్నట్లు సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు. లారీ డ్రైవర్‌ వినయ్, యజమాని సుదర్శన్‌రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.







మహిళలు ఆర్థికంగా ఎదగాలి

సీనియర్‌ సివిల్‌ జడ్జి పద్మావతి

డిచ్‌పల్లి: స్వయం ఉపాధి ద్వారా మహిళలు ఆర్థికంగా ఎదగాలని, కుటుంబానికి అన్ని విధాల తోడుగా నిలువాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్‌ సివిల్‌ జడ్జి పద్మావతి అన్నారు. డిచ్‌పల్లి మండలం నడిపల్లిలో స్వామి ఉమెన్‌ అండ్‌ రూరల్‌ డెవలప్‌మెంట్‌ సొసైటీ (స్వార్డ్స్‌) ఆధ్వర్యంలో నాబార్డు సహకారంతో సోమవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సీనియర్‌ సివిల్‌ జడ్జి పద్మావతి మాట్లాడుతూ.. ప్రతి మహిళా ఆర్థిక స్వావలంభన సాధించే దిశగా ముందుకు సాగాలన్నారు. నాబార్డు సహకారంతో స్వార్డ్స్‌ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో డిచ్‌పల్లి, ఇందల్వాయి, ధర్పల్లి, మోపాల్‌ మండలాల పరిధిలో ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణ, అల్లికలు, జూట్‌ బ్యాగుల తయారీలో శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు జడ్జి ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా చైల్డ్‌ వెల్ఫేర్‌ కమిటీ అధ్యక్షురాలు సంపూర్ణ, నాబార్డు డీడీఎం కే నగేష్, రీజనల్‌ అధికారి నితిన్, నాబ్కాన్స్‌ జిల్లా కోఆర్డినేటర్‌ థామస్‌ మోడి, స్వార్డ్స్‌ సంస్థ ప్రతినిధులు గంగ నర్సయ్య, జాన్‌వెస్లీ, ప్రీతి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్‌ సివిల్‌ జడ్జి పద్మావతి

మహిళలకు చట్టాలే రక్షణ

ఖలీల్‌వాడి : మహిళలకు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యద ర్శి, సీనియర్‌ సివిల్‌ జడ్జి పద్మావతి అన్నారు. నగరంలోని ఖానాపూర్‌లో వర్డ్‌ స్వచ్ఛంద సంస్థ కార్యాలయంలో నిర్వహించిన మహిళ దినోత్సవంలో ఆమె పాల్గొని మాట్లాడారు. చట్టాలు మహిళలకు రక్షణగా ఉన్నాయని తెలిపారు. గృహహింస, బాల్య వివాహాలు, పని ప్రదేశాలలో మహిళలపై వేధింపులపై తోపాటు వివిధ అంశాలపై వివరించారు. వర్డ్‌ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు జ్యోతి, వర్డ్‌ కార్యవర్గ సభ్యుడు ఆశ నారాయణ ఉన్నారు.

అనారోగ్యంతో మహిళ ఆత్మహత్య

తాడ్వాయి:మండలంలోని దేమికలాన్‌ గ్రామానికి చెందిన పుట్ట స్వప్న(36) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. స్వప్న కొన్ని రోజుల నుంచి నడుము నొప్పి, కడుపు నొప్పితో బాధ పడుతోంది. ఎన్ని ఆస్పత్రుల్లో చూపెట్టుకున్నా నయం కాలేదు. దీంతో ఆదివారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకొని బలవన్మరణానికి పాల్పడింది. స్వప్నకు భర్త రామదాస్, ఇద్దరు పిల్లలు ఉన్నారు.


స్వప్న మృతదేహం

కడుపునొప్పి భరించలేక ఒకరు..

నవీపేట: మండలంలోని జలాల్‌పూర్‌ గ్రామానికి చెందిన గంగల్‌ సాయిలు(47) సోమవారం ఉదయం ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై రాజారెడ్డి తెలిపారు. సాయిలు కొంతకాలంగా కడుపు నొప్పితో బాధ పడుతున్నాడు. ఈ క్రమంలో కడుపు నొప్పి భరించలేక ఇంట్లో దూలానికి ఉరేసుకున్నాడని ఎస్సై పేర్కొన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

కరెంట్‌ షాక్‌తో రైతు మృతి


శంకర్‌ (ఫైల్‌)

డిచ్‌పల్లి(మోపాల్‌): మోపాల్‌ మండలం సిర్పూర్‌ శివారులో రైతు సుగంధం శంకర్‌ (56) సోమవారం ప్రమాదవశాత్తు కరెంట్‌షాక్‌ తగిలి మృతి చెందినట్లు ఎస్సై మహేష్‌ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. నిజామాబాద్‌ నగరం పద్మనగర్‌లో నివసించే శంకర్‌ సిర్పూర్‌ శివారులో గల తన పంట పొలానికి నీళ్లు పారించేందుకు వెళ్లాడు. బోరుమోటార్‌ను స్టార్ట్‌ చేయడానికి యత్నించగా.. స్టార్టర్‌ డబ్బాకు విద్యుత్‌ ప్రసరించడంతో షాక్‌ తగిలి మృతిచెందాడు. పొలం వద్దకు వెళ్లిన భర్త తిరిగి రాకపోవడం, ఫోన్‌ చేసినా స్పందించకపోవ డంతో భార్య లక్ష్మీనర్సవ్వ అక్కడికి చేరుకున్నారు. విద్యుత్‌ షాక్‌తో భర్త మృతిచెంది ఉండటం గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రెండు బైక్‌లు ఢీ : ముగ్గురికి గాయాలు

నాగిరెడ్డిపేట: మండలంలోని గోపాల్‌పేట నుంచి లోంకలపల్లి గ్రామానికి వెళ్లే దారిలో ఆదివారం రాత్రి రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో రెండు బైక్‌లు ధ్వంసం కాగా వాటిపై ప్రయాణిస్తున్న ముగ్గరికి తీవ్ర గాయాలయ్యాయి. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. లింగంపేట మండలం మలపాటికి చెందిన కంపె మహేష్‌ వరుసకు సోదరుడైన మహేష్‌తో కలిసి బైక్‌పై గోపాల్‌పేట నుంచి తన స్వగ్రామానికి బయల్దేరాడు. అదే సమయంలో లింగంపేట మండలం శెట్పల్లి సంగారెడ్డి గ్రామానికి చెందిన కుమ్మరి చిరంజీవి తన బైక్‌పై తన స్వగ్రామం నుంచి గోపాల్‌పేటకు వెళ్తున్నాడు. నాగిరెడ్డిపేట శివారులోని పటేల్‌చెరువు వద్ద రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో రెండు బైక్‌ల ముందుభాగాలు నుజ్జునుజ్జయ్యాయి. దీంతోపాటు బైక్‌లపై ప్రయాణిస్తున్న కంపె మహేష్, చిరంజీవి, మహేష్‌కు తీవ్రంగా గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఆస్పత్రులకు తరలించారు. కంపె మహేష్‌ పరిస్థితి విషమంగా ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు. నాగిరెడ్డిపేట పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు.



17లోగా పరీక్ష ఫీజు చెల్లించాలి

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని బీపీఈడీ మూడో సెమిస్టర్‌ రెగ్యులర్, మొదటి సెమిస్టర్‌ బ్యాక్‌లాగ్‌ పరీక్షల ఫీజు చెల్లింపు తుది గడువు ఈ నెల 17 అని కంట్రోలర్‌ ఎం అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. రూ.100 అపరాధ రుసుముతో 18 వరకు చెల్లించే అవకాశం ఉంటుందన్నారు.

బీఈడీ పరీక్ష ఫీజు గడువు 20 వరకు..

బీఈడీ మొదటి సెమిస్టర్‌ పరీక్ష ఫీజు చెల్లింపు తుది గడువు ఈ నెల 20వరకు ఉందని కంట్రోలర్‌ తెలిపారు. రూ.100 అపరాధ రుసుముతో 21 వరకు ఫీజు చెల్లించవచ్చన్నారు. వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్‌ www. telangana university. ac. in ను సంప్రదించాలని సూచించారు.

ఓపెన్‌ యూనివర్సిటీ పరీక్ష ఫీజు చెల్లింపునకు నేడు ఆఖరు

నిజామాబాద్‌ అర్బన్‌: డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ ఓపెన్‌ యూనివర్సిటీ డిగ్రీ తృతీయ సంవత్సరం ఐదో సెమిస్టర్‌ పరీక్ష ఫీజు చెల్లింపునకు గడువు ముగిసిందని రీజినల్‌ కోఆర్డినేటర్‌ రంజిత ఒక ప్రకటనలో తెలిపారు. రూ.1000 అపరాధ రుసుంతో మంగళవారం ఫీజు చెల్లించడానికి చివరి అవకాశమన్నారు. వివరాలకు 7382929612 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

















